సాక్షి
చిత్తూరు

బుధవారం । 16 । ఏప్రిల్ । 2025



భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

భూసమస్యలపై వీఆర్ఓలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి పేర్కొన్నారు. - 8లో



పారదర్శకమైన ఓటర్ల జాబితా

జిల్లాలోపారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఆర్ఓ తెలిపారు. - 8లో



అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ

అగ్ని ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపకశాఖ అధికారి పెద్దిరెడ్డి తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర అసెంబ్లీ పద్దుల కమిటీ బుధవారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ పద్దుల కమిటీ చైర్మన్ జోగేశ్వర రావుతో పాటు 11 మంది సభ్యులు మంగళవారం చిత్తూరుకు వస్తారన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మధ్యాహ్నం 2 గంటలకు సమీక్ష నిర్వహిస్తారని తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు రోడ్డు మార్గంలో తిరుమలకు వెళ్తారన్నారు. ఈ కమిటీ సభ్యులుగా ఎమ్మెల్యేలు భూమా అఖిల ప్రియ , బండారు సత్యానంద రావు, జయకృష్ణ, కందుల నారాయణ రెడ్డి, మద్దిపాటి వెంకట రాజు, పార్థసారథి వాల్మీకి, పాసిం సునీల్ కుమార్, ఏలూరి సాంబ శివ రావు, ఎంఎల్‌సీలు పర్చూరి అశోక్ బాబు, డా.వెంకట సూర్య నారాయణ రాజు, కళ్యాణి విచ్చేస్తారని కలెక్టర్ వెల్లడించారు.

వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : నిర్బంధ వెట్టిచాకిరీ చట్టరీత్యా నేరమని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో నిర్బంధ వెట్టిచాకిరీ బారిన పడుతున్న కూలీలకు విముక్తి కలిగేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నిర్బంధ వెట్టిచాకిరీ విధానం పౌల్ట్రీ, పరిశ్రమలు, ఇటుకల తయారీ ప్రాంతాలలో చాలా వరకు అమలవుతుంటాయన్నారు. వెట్టిచాకిరీ వల్ల ఆర్థిక, శ్రమ దోపిడీతో ఇబ్బందులకు లోనవుతుంటారని తెలిపారు. అటువంటి వ్యక్తులను గుర్తించేందుకు ఆర్డీవో డివిజన్ స్థాయిలో తహసీల్దార్‌లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్మిక శాఖ, డీఆర్డీఏ, డ్వామా, జెడ్పీ సీఈవో, తదితర అధికారులు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. నిర్బంధ కూలీలకు పునరావాసం కల్పించిన అనంతరం సంక్షేమ పథకాలతో ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై ముద్రించిన గోడపత్రికలు, కరపత్రికలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఓంకార్, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, రోప్స్ సంస్థ చైర్మన్ ధనశేఖర్ పాల్గొన్నారు.

అపచారం పహాస్యం



కలియుగ వైకుంఠం.. పరమ పవిత్రం ..ఆధ్యాత్మిక నిలయం..భక్తులకు అది అపురూపం.. అంతటి తిరుమల క్షేత్రం నేడు అపవిత్రం.. మద్యం, మాంసం, పాదరక్షలతో ఆలయ ప్రవేశ యత్నం.. గోశాలలో గో మరణ మృదంగం.. శ్రీవారి ఆలయంపై డ్రోన్ల సంచారం ఒకటేమిటీ వరుస సంఘటనలు చోటు చేసుకోవడం మహా అపచారం.. వెరసి భక్తుల దెబ్బతిన్న మనోభావం .. ప్రశ్నించిన గొంతు నొక్కే ప్రయత్నం.. ఎదురుదాడి.. తమ పాపం ఎదుటి వారిపై నెట్టే ప్రచారం జరుగుతోంది. ఏడుకొండలపై అసలేం జరుగుతోంది.. ఏమై పోతోంది.. అంతా సత్యం వధ.. ధర్మం చెరేనా? అని భక్తులు మదనపడుతున్నారు.



తిరుమలలో మద్యం మత్తులో వీరంగం చేస్తున్న యువకుడు(ఫైల్)

ప్రశ్నించే గొంతు నొక్కేస్తారా?

- లోపాలను ఎత్తి చూపితే.. పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులదే
- భక్తుల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి
- ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం దారుణం
- తిరుమలలో అపచారాల కట్టడికి చర్యలు తీసుకోలేరా?
- 10 నెలలుగా సాక్షాత్తు తిరుమలలో జరిగిన ఘటనలకు బాధ్యులెవరు?
- ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం అపచారాలను అడ్డుకోవాలి
- టీటీడీ అధికారులకు స్థానికులు, భక్తులు, మేధావుల హితవు

తిరుపతి సిటీ: కలియుగ వైకుంఠంలో గత పది నెలలుగా సత్యం వధ.. ధర్మం చెరగా పాలన సాగుతోంది. దీన్ని ప్రశ్నించే గొంతుకలపై ఎదురుదాడి జరుగుతోంది. ఆధ్యాత్మిక సంస్థలో జరిగే లోటుపాట్లు సున్నిత పరిష్కారానికి చర్యలు లేకపోగా.. టీటీడీలో పచ్చపాలకులు, ఏజెంట్లు, అల్లరి మూకలు చేస్తున్న తప్పిదాలను రాజకీయకోణంలో చూపుతూ ప్రత్యర్థులపై నెట్టే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇదంతా చూస్తే అసలు తిరుమల, తిరుపతి దేవస్థానంలో ఏమి జరుగుతోంది.. అసలు తిరుమల.. ఆధ్యాత్మిక క్షేత్రమా.. పచ్చ పాపాలకు వ్యాపార నిలయమా?.. అని భక్తులు మనోవేదనకు గురికావాల్సిన దుస్థితి నెలకొంటోంది.



తిరుమలలో పోలీసులు పట్టుకున్న ఎగ్ పలావ్(ఫైల్)

పది నెలలుగా అన్నీ అపచారాలే..

ఆధ్యాత్మిక రాజధానిగా గుర్తింపు పొందిన పవిత్ర పుణ్యక్షేత్రంలో గత 10 నెలలుగా అన్నీ అపచారాలే జరుగుతున్నాయి. శ్రీవారి క్షేత్రంలో మద్యం బాటిళ్లు, బిర్యానీలు, మాంసం, మందుబాబుల వికృత చేష్టలు, పాదరక్షలతో ఆలయంలోకి ప్రవేశించే యత్నం, డ్రోన్ కెమెరాల హల్‌చల్, పాపవినాశం తీర్థంలో బోట్ల విహారం, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న గోశాలలో గోవుల మరణ మృదంగం, ముంతాజ్ హోటల్ అనుమతులు తదితర సంఘటనలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వీటిపై సాక్షాత్తు స్వామిజీలు మండిపడి, టీటీడీ, ప్రభుత్వ వ్యవహారశైలికి నిరసనగా ధర్నాలు చేసిన ఘటనలు సామాన్య భక్తులతో పాటు స్థానికులను కలవరపెట్టాయి. వీటిని కట్టడి చేయాల్సిన ప్రభుత్వం , టీటీడీ అధికారులు లోపాలను ఎత్తి చూపుతున్న సామాన్యులపైనా, భక్తులపై కక్ష్య సాధింపు చర్యలు దిగడం దారుణమని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పవిత్రపుణ్యక్షేత్రంలో జరిగే అపచారాలపై దృష్టి పెట్టకుండా రాజకీయ కోణంలో చూస్తూ అధికారులు వ్యవహరించడం సమజసం కాదంటూ స్థానికులు, భక్తులు, ప్రజా సంఘాలు, మేధావులు హితవు పలుకుతున్నారు.



తిరుమలలో పట్టుబడిన మద్యం(ఫైల్)

వాటిని పక్కదారి పట్టించేందుకు సాక్షాత్తు కార్యనిర్వాహణాధికారి స్థాయి అధికారులే ప్రయత్నిస్తున్నారని చెబుతున్నారు. అలాగే వారు చేసిన నేరాలు ప్రశ్నించే వారిపై నెట్టేందుకు తీవ్రస్థాయిలో ప్రయత్నిస్తూ వారికి అనుకూల మీడియాల్లో ప్రచారం చేస్తూ టీడీపీ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారని భక్తులు మండిపడుతున్నారు.

రాజకీయ ఏజెంట్లుగా అధికారులు

టీటీడీలో జరుగుతున్న అపచారాలను కప్పిపుచ్చేందుకు పచ్చనేతలు ఆ ధార్మిక సంస్థలో అధికారులనే రాజకీయ ఏజెంట్లుగా మార్చుతున్నారని భక్తులు వాపోతున్నారు. ఈ క్రమంలోనే వారు పవిత్ర పుణ్యక్షేత్రంలో జరుగుతున్న అపచారాలను ఎత్తి చూపితే..

అపచారాలకు అడ్డుకట్ట వేయలేరా?



కొన్ని నెలలుగా తిరుమల పుణ్యక్షేత్రంలో జరుగుతున్న దారుణమైన ఘటనలకు టీటీడీ అధికారులు అడ్డుకట్ట వేయకపోవడం విచారకరం. భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా మద్యం, మాంసం , బహిరంగంగా దొరకడం అపచారం. తిరుమలలో అకతాయిలు మద్యం సేవించి గొడవలు పడిన సంఘటన బాధించే అంశం. టీటీడీ గోశాలలో గోవుల మరణాలపై వస్తున్న వార్తలు గో ప్రేమికులు, శ్రీవారి భక్తులను మరింత క్షోభకు గురిచేశాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా టీటీడీ చర్యలు చేపట్టాలి. లోపాలను ఎత్తి చూపడం భక్తుల బాధ్యతగా అధికారులు గుర్తించాలి. **- తుమ్మ ఓంకార్, తిరుక్షేత్రాల రక్షణ సమితి అధ్యక్షులు, తిరుపతి**

వివరణ కాదు.. విచారణ జరపాలి



టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గోశాలలో గోవులు అధిక సంఖ్యలో మరణించాయని వస్తున్న ఆరోపణలపై టీటీడీ అధికారులు ప్రెస్ మీట్‌లు పెట్టి వివరణ ఇవ్వడం దారుణం. వాటి పై వాస్తవాలను వెలికితీసేందుకు విచారణ చేప ట్టి నిజాలను నిగ్గు తేల్చాలి. మూగజీవులు ఇంత పెద్ద సంఖ్యలో మృతి చెందడం, అనారోగ్యానికి గురికావడం భక్తుల, జంతు ప్రేమికుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి. తక్షణం అఖిలపక్షం ఆధ్వర్యంలో పరిశీలన జరపాలి. నిర్లక్ష్యం కారణమైతే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. **- వందవాసి నాగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, తిరుపతి**

గొంతు నొక్కడం భావ్యమా?



టీటీడీలో ప్రతినిత్యం ఏదో ఒక అపచారం జరగడం బాధించే అంశం. అధికారులు బేషాజాలకు పోకుండా భక్తుల మనోభావాలను కాపాడాలి. నిషేధిత వస్తువులను తిరుమలకు చేరకుండా పటిష్ట తనిఖీలు నిర్వహించాలి. పార్టీలకతీతంగా శ్రీవారి సన్నిధిలో అపచారం జరిగితే లోపాలను ఎత్తి చూపడం భక్తుల హక్కు, కర్తవ్యం కూడా. అలాంటి లోపాలు జరిగినప్పుడు వెంటనే అధికారులు వాటిని సరిదిద్దేందుకు సిద్ధపడాలే తప్ప, గొంతు నొక్కడం, కేసులు బనాయించడం విచారకరం. **- నరసింహులు, స్థానిక భక్తుడు, తిరుపతి**

అధికారుల అప్రమత్తత అవసరం



టీటీడీలో తరచూ జరుగుతున్న ఘటనలు భక్తులను బాధిస్తున్నాయి. శ్రీవారి సన్నిధిలో ఇలాంటి అపచారాలు జరగకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. అధికారులు అప్రమత్తంగా ఉండి, తిరుమల పవిత్రతను కాపాడాల్సిన అవసరం ఉంది. డ్రోన్ కెమెరాలతో ఫొటోషూట్ చేయడం ఎంత అపచారం. డ్రోన్ కెమెరాను ఎలా అనుమతించారో? అధికారులే సమాధానం చెప్పాలి. తిరుమలలో అభద్రతాభావం నెలకొంటే ప్రమాదమే. అధికారులు మేలుకోవాలి. **-సెల్వకుమార్, తమిళ భక్తుడు, వేలూరు**

అసాంఘిక శక్తులకు అడ్డుకట్ట పడేనా?



పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలకు అపకీర్తి తీసుకువచ్చే చర్యలను అధికారులు అడ్డుకోవాలి. మందు, మాంసం, డ్రోన్ కెమెరాల హల్‌చల్, అకతాయితీల వికృత చేష్టలను ప్రశ్నించే హక్కు ప్రతి భక్తునికీ ఉంటుంది. వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. అపచారం జరిగిన ఘటనపై ప్రత్యేక దృష్టి సారించి పునరావృతం కాకుండా టీటీడీ అధికారులు చర్యలు తీసుకోవాలి. గోవుల మృతి వార్తలు భకులు, జంతు ప్రేమికులను బాధించాయి. **-మహాలక్ష్మి, శ్రీవారి భక్తురాలు, శ్రీకాళహస్తి**

విద్యార్థుల ట్యాబ్‌లు లాక్కున్న ఇన్‌చార్జ్ హెచ్‌ఎం

- మండిపడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గంగవరం : విద్యార్థుల నుంచి గత ప్రభుత్వం ఉచితంగా అందజేసిన ట్యాబ్స్‌ను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని కల్లుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో చోటు చేసుకుంది. విద్యార్థులు, తల్లిదండ్రుల కథనం.. గత ప్రభుత్వంలో కల్లుపల్లి జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ట్యాబ్స్ పంపిణీ చేశారు. ఎలాంటి ప్రభుత్వ ఆదేశాలు, అనుమతి లేకుండా స్థానిక ఇన్‌చార్జి హెచ్‌ఎం నరసింహయ్య విద్యార్థుల ట్యాబ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సెకండ్ హ్యాండ్ ధరలకు విక్రయాలు చేసుకోవడం కోసమేనా అంటూ ఆ ఇన్‌చార్జి హెచ్‌ఎంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. దీనిపై ఎంఈవో-1 వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థుల నుంచి ట్యాబ్స్ లాక్కోవాలన్న ప్రభుత్వ ఆంక్షలు ఎక్కడా లేవన్నారు. ఒకవేళ కల్లుపల్లి హైస్కూల్‌లో విద్యార్థుల నుంచి ట్యాబ్స్ వాస్తవంగా తీసుకున్నట్లు తెలిస్తే ఆ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలు తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ కేడర్ నుంచి హెచ్‌ఎంలుగా ఉద్యోగోన్నతికి విడుదల చేసిన జాబితాలో అభ్యంతరాలు తెలపాలని డీఈవో వరలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈనెల 13వ తేదీన సీనియారిటీ జాబితా విడుదల చేసినట్లు చెప్పారు. ఉద్యోగోన్నతుల ప్రక్రియకు ఏకీకృత సీనియారిటీ జాబితాను రూపొందించి www.chittoordeo.com వెబ్‌సైట్ లో పొందుపరిచినట్లు తెలిపారు. అన్ని మేనేజ్‌మెంట్‌ల టీచర్ల జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. జిల్లాలోని టీచర్లు జాబితాల్లో సర్వీస్, సీనియారిటీ వివరాలను సరిచూసుకోవాలన్నారు. ఏవైనా అభ్యంతరాలున్నట్‌లెతై బుధవారం డీఈవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఆధారాలతో తెలియజేయాలని ఆదేశించారు. గడువు తర్వాత వచ్చే అభ్యంతరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించమని డీఈవో స్పష్టం చేశారు.

అనారోగ్యం కొంటున్నారు

ఎండలు మండిపోతున్నాయి.. వేసవి తాపం భరించలేక చల్లటి పానీయాలతో గొంతు తడుపుకుంటున్నారు. అందులో చల్లని ఐస్ లేనిదే లోపలికి పోనంటోంది. ఈ తరుణంలో జ్యూస్ విక్రయాలు జోరందుకున్నాయి. ఫలితంగా ఐస్ గడ్డలకు భలే గిరాకీ వచ్చి పడింది. జిల్లాతో పాటు తమిళనాడు నుంచి ఐస్ గడ్డలు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు సరఫరా అవుతున్నాయి. అయితే ఈ తయారీలో శుభ్రత ఎంత అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. అపరిశ్రుభత ఐస్ ముక్కలు ప్రజలకు అనారోగ్య సమస్యలు తెచ్చిపెడుతున్నాయంటూ వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఐస్ తయారీ కేంద్రాలను పర్యవేక్షించే అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు చల్లటి పానీయాలతో అనారోగ్యం కొని తెచ్చుకుంటున్నారు.



అపరిశుభ్రంగా ఐస్ తయారీ కేంద్రం

తుప్పు పట్టిన తయారీ కేంద్రాలు

సాధారణంగా మార్కెట్లో రెండు రకాల ఐస్ దొరుకుతోంది. మొదటిది పారిశ్రామిక అవసరాల కోసం, రెండోది ఎడిబుల్ నిమిత్తం వినియోగించేది. మొదటి రకం చేపలు, మాంసాన్ని ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచుకునేందుకు పండ్లు ఇతర వస్తువులు ఎగుమతి చేసేందుకు, ఆస్పత్రుల్లోని మార్చురీల్లో వినియోగిస్తారు. దీన్ని ఏ నీటితోనైనా ఎలాంటి ప్రదేశాల్లోనైనా తయారు చేయొచ్చు. ఇక రెండో రకం దీన్ని కచ్చితంగా శుద్ధి చేసిన నీటితో పరిశుభ్రమైన వాతావరణంలోనే తయారు చేయాలి. దీన్ని పానీయాల్లో వాడితే ఎలాంటి ప్రమాదమూ ఉండదు. ఈ ఐస్ ధర ఎక్కువగా ఉండటంతో చల్లని పానీయాలు విక్రయించే వ్యాపారులు తక్కువగా ధరకు దొరికే మొదటి రకం ఐస్‌ను వాడుతున్నారు. ఐస్ తయారీకి వినియోగించే నీటితో టీడీఎస్ 50–150 వరకు ఉండాలి. 250 వరకు ఉన్నా వినియోగించొచ్చు. పీపీఎం 300పైన ఉండాలి. ఈ నిబంధనలు అక్కడ తుప్పు పట్టాయి. ఇక ఐస్ క్యూబ్స్ అచ్చులు తయారీకి ఇనుప రేకు డబ్బాలు వినియోగిస్తున్నారు. ఇవి తప్పు పట్టి..చిన్న చిన్న ముక్కలు ఊడిపోతున్నాయి. తయారీ కేంద్రాల వద్ద శుభ్రత పూర్తిగా కనిపించడంలేదు.

అమ్మో..ఐస్

- చల్లని పానీయాలు.. ఐస్‌గడ్డ విక్రయాలు
- తయారీలో కానరాని శుభ్రత
- వెంటాడుతున్న అనారోగ్య సమస్యలు
- హెచ్చరికలు జారీ చేస్తున్న వైద్యనిపుణులు

కాణిపాకం : జిల్లాలో జ్యూస్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. పట్టణ ప్రాంతాల్లో వీధికి రెండు నుంచి మూడు షాపులుంటాయి. వేసవి కాలం వస్తే రోడంతా చల్లటి జ్యూస్ షాపులు కిటకిటలాడుతుంటాయి. ఇంటి నుంచి బయటకొచ్చిన వారిలో 40 శాతం మంది వీటిని గబగబా తాగేస్తుంటారు. వీరంతా చల్లటి ఐస్ వేస్తే తప్ప ఆ జ్యూస్ ముట్టుకోవడం లేదు. ఇక వేసవి సీజన్‌లో జరిగే ప్రతి శుభకార్యంలోనూ ఈ చల్లటి ఐస్ ముక్కలు వేసి కలిపిన జ్యూస్‌లు విచ్చలవిడిగా ఇస్తుంటారు. ఈ ఐస్ గడ్డలు తయారు చేసే కేంద్రాలు చాలా చోట్ల అధ్వాన్నంగా కలుషిత నీటితో తయారీ చేస్తుంటారని, రోగాలు తప్పవని వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో ఐస్ గడ్డ తయారీ కేంద్రాలు 40 దాకా ఉన్నాయి. ఒక్కో షాపు నుంచి రోజువారిగా సుమారు 500 కిలోలు అమ్ముడుపోతాయని అంచనా. ఈ లెక్కన జిల్లాలో 20 వేల కిలోల ఐస్ గడ్డలు అమ్ముడుపోతుంటాయి. దీనికి తోడు జిల్లా సరిహద్దు ప్రాంతాలకు తమిళనాడు నుంచి ఐస్ గడ్డలు విపరీతంగా సరఫరా అవుతున్నాయి. ఇలా ఐస్ గడ్డల విక్రయాల ద్వారా జిల్లాలో రూ. 8 లక్షలకు పైగా వ్యాపారం నడుస్తున్నట్లు వారు లెక్కలు చెబుతున్నారు.



ఐస్ గడ్డలు

నిబంధనలకు విరుద్ధంగా..

ఐస్ గడ్డల తయారీ సీజనల్ వ్యాపారమే అయినా తక్కువ పెట్టుబడి .. అధిక లాభాలున్నాయి. అయితే ఐస్ తయారీ కేంద్రాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి. పరిశ్రమల శాఖ, ట్రేడ్ లైసెన్స్, కాలుష్య నియంత్రణ బోర్డు, విద్యుత్ శాఖ ద్వారా వాణిజ్య విద్యుత్తు కనెక్షన్, భవనానికి సంబంధించి పట్టణ ప్రణాళిక, అగ్నిమాపక శాఖల నుంచి అనుమతులుండాలి. చాలా చోట్ల ఈ రకమైన అనుమతులు లేవు. చాలా వరకు ఇళ్ల మధ్య, రేకుల షెడ్లలో నిర్వహిస్తున్నారు.

అపరిశుభ్రమైన ఐస్ వాడకంతో..

అపరిశుభమైన ఐస్ వాడటం వల్ల అనారోగ్య సమస్యలు ముంచెత్తుతున్నాయి. విష జ్వరాలు, టైఫాయిడ్, దగ్గు దడ పుట్టిస్తున్నాయి. గొంతునొప్పి, ఊపిరితిత్తుల సమస్యలు బాధేస్తున్నాయి. చిన్న పిల్లలకు గవద బిళ్లలు వచ్చే ప్రమాదం ఉంటుంది. రోటా, అడినో, హైపటైటిస్–ఏ వంటి వైరస్‌ల వల్ల ఊపిరితిత్తులు, పచ్చకామెర్లు వస్తుంటాయి. ఈ–కోలీ, సిగెల్లా వంటి వైరస్‌ల వల్ల వాంతులు, విరేచనాలు అవుతుంటాయని ప్రజలు జాగ్రత్త పడాలంటూ నిపుణులు సూచిస్తున్నారు.



తుప్పు పట్టిన ఐస్ తయారీ పెట్టే

జాగ్రత్తలు తప్పనిసరి



ఎండలో తిరిగాం.. చల్లటి జ్యూస్ తాగుదామని అనుకుంటే కచ్చితంగా ప్రతి ఒక్కరూ శుభ్రతను పరీక్షించుకోవాలి. చల్లగా ఉందని గటగటా తాగితే అనారోగ్య సమస్యలు వెంటాడుతాయి. వాంతులు, విరేచనాలవుతాయి. ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌లు అవుతాయి. ఎండా కాలంలో కచ్చితంగా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి జ్యూస్‌లకు బదులు తాజా పండ్లు, అధిక నీటిని తీసుకుంటే చాలు. సబ్జా గింజలు రోజుకు 15 గ్రాములు నానబెట్టి తీసుకుంటే శరీరం వేడి నుంచి ఉపశమనం లభిస్తుంది. **- నందీశ్వర్, వైద్య నిపుణులు, చిత్తూరు**

అంబేడ్కర్ జయంతిలో దళితులకు అవమానం



మునిరత్నం

పూతలపట్టు (కాణిపాకం) : పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన అంబేడ్కర్ జయంతి వేడుకలకు సొంత పార్టీ దళిత నేతలకే ఆహ్వానం దక్కలేదని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి, నేషనల్ దళిత ఫోరం అధ్యక్షుడు ఆనగల్లు మునిరత్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. పూతలపట్టు మండల కేంద్రంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్లుగా పార్టీలకతీతంగా అంబేడ్కర్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే ఒంటెత్తు పోకడలతో అధికార దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. జయంతి ఉత్సవాలకు ఏకపక్ష ధోరణితో రాజకీయం చేయడం తగదన్నారు. అధికారుల ద్వారా ప్రలోభాలు పెట్టి డ్వాక్రా మహిళలతోనే జయంతి ఉత్సవాలను చప్పగా ముగించడం కరెక్టు కాదని విరుచుకుపడ్డారు. ఏటా అన్ని పార్టీల కలయికతో జరిగే ఉత్సవాలకు ఈసారి పార్టీ రంగు వేశారని, ఇలా చేయడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

18న విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్ : వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీ రోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు సమస్యలు తెలపవచ్చన్నారు. సమస్యలను వినతి రూపంలో ఇవ్వాలని వివరించారు.

చూడ కార్యదర్శి బదిలీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (చూడ)కార్యదర్శిగా పనిచేస్తున్న ఆర్. రమేష్ బాబును బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ పనిచేస్తున్న రమేష్ బాబును కడప మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ గా బదిలీ చేశారు.

క్లుప్తంగా

భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

పాలసముద్రం : మండల పరిధిలోని రైతుల భూసమస్యలపై వీఆర్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి కులశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. మంగళవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌ఓలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వీఆర్‌ఓలతో రీసర్వే, రెవెన్యూ సదస్సులు రైతుల వద్ద నుంచి ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిలో ఎన్నింటిని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. శ్రీకావేరిరాజుపురం వీఆర్‌ఓ తంగరాజ్ రెవెన్యూ సదస్సు, రీ సర్వేలో వచ్చిన అర్జీలు ఎన్ని పరిష్కరించారని అడిగితే సక్రమంగా సమాధానం చెప్పకపోవడంతో ఆయనపై మండిపడ్డారు. నోస్నల్ ఖాతాల్లో పడిన సర్వే నంబర్లను రైతుల వద్ద నుంచి పత్రాలు తీసుకుని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్ఆర్ దేవి, వీఆర్‌ఓ శ్రీనివాసులు, రమణయ్య, రమేష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



పుత్తూరు : మండల పరిధిలోని పరమేశ్వరమంగళం గ్రామ సచివాలయ వద్ద జాతీయ రహదారి పై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్‌ఐ ఓబయ్య తెలిపారు. రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొ నడంతో ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలియరావాల్సి ఉందన్నారు. మృతుడి వయస్సు (60) ఉంటుందని, తెలుగు రంగు షర్ట్, పంచ ధరించి ఉన్నాడని తెలిపారు. కడుపు కుడి, ఎడమల వైపు నల్లటి పుట్టు మచ్చ లు ఉన్నాయన్నారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సారా స్వాధీనం.. నలుగురి అరెస్టు

పుంగనూరు : వివిధ ప్రాంతాలలో సారా విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మంగళవారం ఎక్సైజ్ సీఐ సురేష్ తెలిపారు. మండలంలోని పెద్దతండా సమీపంలో సారా విక్రయిస్తున్న పద్మను అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే పత్రపల్లె సమీపంలో సారా విక్రయిస్తున్న రమణా నాయక్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అదే గ్రామానికి చెందిన తిప్పానాయక్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. అలాగే సారా తయారీకి బెల్లం విక్రయిస్తున్న వెంకట రమణారెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఈ దాడుల్లో చిత్తూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ జవహర్‌బాబు, ఇన్‌స్పెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది ఢిల్లీబాబు, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, సురేంద్రబాబు, వినోద్, శ్వేత, మమత, నరేంద్రరెడ్డి, దశరథ, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యుత్ క్రమబద్ధీకరణకు దూరం

● కుప్పంలోని గుణ రోజువారి కూలీగా జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు దాడులు నిర్వహించి ఆయన అదనంగా 2 కిలో వాట్ల విద్యుత్తు వినియోగిస్తున్నారని గుర్తించారు. ఆయనకు రూ.4,450 చెల్లించాలని నోటీసు ఇచ్చారు.

● నగరి పరిధిలో ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న ప్రైవేటు ఉద్యోగి రమేష్ అనే వ్యక్తి ఇంటికి వచ్చిన విద్యుత్‌శాఖ సిబ్బంది తనిఖీలు చేశారు. తీసుకున్న లోడు కంటే వాడే లోడ్ 4 కిలోవాట్లు అదనంగా వినియోగిస్తున్నారని తెలుసుకున్నారు. అందుకు గాను రూ.8,850 చెల్లించాలని నోటీసులు జారీ చేశారు.

- వినియోగదారుల్లో కానరాని ఆదరణ
- కనిపించని విద్యుత్ శాఖ ప్రచారం
- విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణకు రాయితీ



మీటర్

చిత్తూరు కార్పొరేషన్ : మారుతున్న కాలానుగుణంగా విద్యుత్ పరికరాల వినియోగం అధికమవుతోంది. ఈ క్రమంలో అవగాహన లేక వినియోగదారులపై భారం పడుతోంది. గతంలో వారు విద్యుత్ కనెక్షన్ తీసుకున్న రోజున లోడుకు నేడు వినియోగిస్తున్న లోడుకు సంబంధం లేదు. దీంతో అధికారులు తనిఖీ చేసిన సమయంలో క్రమబద్ధీకరణకు చెల్లించాలని నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యుత్‌శాఖ అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వినియోగదారులకు ధరలో 50 శాతం రాయితీ ఇస్తోంది. కిలోవాట్‌కు రూ.2250 బదులు రూ.1,250 చెల్లిస్తే సరిపోతుంది. ఈ అవకాశం జూన్ 30 వరకు అందుబాటులో ఉంటుంది.

గృహ వినియోగదారులకు ఇంత మొత్తంలో రాయితీ కల్పిస్తున్నా తగినంత ప్రచారం లేదు. అధికారులు పత్రికా ప్రకటనలు కాకుండా సెక్షన్, సబ్ డివిజన్ల వారీగా వీటిపై అవగాహన కల్పించాలి. ఏఈ, డీఈ, ఈఈ, ఈఆర్వో కార్యాలయాలు, రద్దీ ప్రాంతాల్లో బ్యానర్లు ఏర్పాటు చేయాలి. ప్రతినెలా విద్యుత్ బిల్లులు ఇచ్చేటప్పుడు వినియోగదారులకు వీటిపై అవగాహన కోసం కరపత్రాలను ఇవ్వాలి. జిల్లాలో మొత్తం 4,37,377 గృహ సర్వీసులు ఉన్నాయి. స్వచ్ఛందలోడ్ కాబట్టి ఎంత మందికి ఇది అవసరమో గణాంకాలు అధికారుల వద్ద లేవు. ఇప్పటి వరకు జిల్లాలో 1,893 మంది క్రమబద్ధీకరణ చేసుకోగా వాటి ద్వారా సంస్థకు రూ.20 లక్షలు వచ్చింది.

ఎక్కడ చేసుకోవాలి

మీ కరెంటు బిల్లు తీసుకుని బిల్లు వసూలు కేంద్రానికి వెళ్లాలి. లోడ్ రెగ్యులైజేషన్, 50 శాతం రాయితీ అని చెబితే సరిపోతుంది. ఒక కిలోవాట్‌కు రూ.1000 ఇతర రుసుములు రూ.250 కలిపి రూ.1250 కట్టించుకుంటారు. అదే రెండు కిలో వాట్లు అయితే రూ.2450, 3 కిలోవాట్లు అయితే రూ.3,650 చెల్లించాలి. అదే ఆన్‌లైన్లో చెల్లించాలి అంటే ఏపీఎస్పీడీసీఎల్ సైట్‌లోకి వెళ్లాలి. అందులో వాలంటరీ అడిషనల్ లోడ్ స్కీము 50 శాతం రాయితీ డెవలప్‌మెంట్ చార్జీస్ అనే వాటిని క్లిక్ చేయాలి. అందులో విద్యుత్ సర్వీసు నంబర్ ఇచ్చి డిటెయిల్స్‌లోకి వెళ్లాలి. అందులో విత్ అవుట్ ఎస్టిమేట్ నమోదు చేసి మొబైల్ నంబరును కొట్టాలి. ఉన్న లోడ్, అడిషనల్ లోడ్‌ను నమోదు చేయాలి. తర్వాత కరెంటు బిల్లు, ఐడీ ప్రూఫ్‌ను పీడీఎఫ్‌లో అప్‌లోడ్ చేసి డిమాండ్‌ను చెల్లించాలి. వచ్చే నెల నుంచి మీ లోడ్ వివరాలు కనిపిస్తాయి.

నోటీసులు ఇస్తే మొత్తం చెల్లించాలి

వాడే విద్యుత్‌ను బట్టి ఇంట్లో ఉన్న ఉపకరణాలను అంచనా వేయవచ్చు. బిల్లు ఎక్కువగా వస్తుంటే అదనపు లోడ్ వాడుతున్నట్లు గుర్తిస్తారు. ఇలాంటి వారి సర్వీసులను అధికారులు తనిఖీ చేసి అదనంగా ఎంత లోడ్ వాడుతున్నారో నమోదు చేస్తారు. దానికి డబ్బులు చెల్లించాలని నోటీసులు ఇస్తారు. అధికారులు తనిఖీ చేసి నోటీసులు ఇస్తే కిలోవాట్‌కు నిర్దేశించిన మొత్తం చెల్లించాలి. అందులో ఎటువంటి రాయితీలు రావు. ఒక ఇంట్లో 4 ట్యూబ్‌లైట్లు, 3 ఫ్యాన్లు, వాషింగ్ మెషిన్, ఏసీ, ఫ్రిడ్జ్, ఐరన్‌బాక్స్, ఎలక్ట్రికల్ కుక్కర్, టీవీ, కంప్యూటర్ ఉంటే వీటి సామర్థ్యం దాదాపు 6 కిలోవాట్లు. మీ ఇంటి కనెక్షన్ 2 కిలోవాట్లు అయితే అదనంగా 4 కేవీ వాడుకుంటున్నట్లే. ఇలా అదనంగా వాడుకునే దానికి 50 శాతం రాయితీతో రెగ్యులరైజ్ జూన్ 30 లోపు చేసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు.

మీ నివాసం లోడ్ ఎంత?

చాలా మందికి తమ ఇంటి విద్యుత్ కనెక్షన్ లోడ్ ఎంతో తెలియదు. సంవత్సరాల కిందట కనెక్షన్లు తీసుకున్న వారు వేల మంది ఉన్నారు. అప్పట్లో ఒక కిలోవాట్ అంత కన్నా తక్కువ కట్టించుకుని కనెక్షన్లు ఇచ్చారు. ఇప్పుడు ప్రతి నివాసంలో పరికరాలు సంఖ్య పెరిగింది. దీనికి తోడు వేసవిలో ఫ్యాన్, కూలర్, ఏసీలు పెరుగుతున్నాయి. దీంతో లోడ్ పెరిగి ట్రిప్ సమస్యలతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కాంట్రాక్ట్ లోడ్ మీ ఇంటి విద్యుత్ లోడ్‌ను తెలియజేస్తుంది. విద్యుత్ బిల్లులో ఉన్న ఆ లోడ్‌ను పరిశీలించి ఇంట్లో వాడుతున్న పరికరాల కెపాసిటీ ఆధారంగా సింపుల్‌గా లెక్కకట్టి అదనపు లోడ్ ఎంత అవసరమో తెలుసుకోవచ్చు. ఉదాహరణకు 10 సంవత్సరాల కిందట 1 కేవీతో సర్వీసు తీసుకున్న వారు ప్రస్తుతం ఏసీ, వాషింగ్ మెషిన్, మోటారు, మిక్సీ ఇలా పరికరాల సంఖ్య పెరిగి ఉంటుంది. 1 టన్ ఏసీకే తీసుకున్న కెపాసిటీ సరిపోతుంది. మిగిలిన వాటికి తక్కువనుకున్నా 2 కేవీ క్రమబద్ధీకరణ చేసుకోవాల్సి ఉంది. వీటికి సిబ్బంది తనిఖీ చేయక ముందే స్వచ్ఛందంగా చెల్లిస్తే రూ.4,450 కాకుండా రూ.2,450 చెల్లిస్తే సరిపోతుంది.

అదనపు లోడు క్రమబద్ధీకరణ ఆఫర్

	అసలు ధర	ఆఫర్ ధర
1 కిలో వాట్	2250	1250
2 కిలో వాట్	4450	2450
3 కిలో వాట్	6650	3650
4 కిలో వాట్	8850	4850
5 కిలో వాట్	11050	6050

జూన్ వరకు నిరీక్షించొద్దు

స్వచ్ఛందంగా అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు గడువు చివరి వరకు వేచి ఉండద్దు. జూన్ వరకు సమయం ఉందని పలువురు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అంతలోపు సిబ్బంది తనిఖీలు చేసి నోటీసులు ఇస్తే రాయితీ రాదు. విద్యుత్ బిల్లులు చెల్లింపు కేంద్రాల వద్ద ప్రచార బ్యానర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం. వినియోగదారులు 50 శాతం రాయితీ అవకాశాన్ని వినియోగించుకోండి.

– ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ ట్రాన్స్‌కో

నేలరాలిన ఆశలు

- గాలీవానకు నేలరాలిన మామిడి కాయలు
- లబోదిబోమంటున్న అన్నదాతలు



రొంపిచెర్ల మండలంలో గాలీవానకు రాలిన మామిడి కాయలు

రొంపిచెర్ల : రొంపిచెర్ల మండలంలో సోమవారం సాయంత్రం కురిసిన గాలీవానకు మామిడి కాయలు నేల రాలాయి. మండలంలోని మోటుమల్లెల, బోడిపాటివారిపల్లె, రొంపిచెర్ల, పెద్దమల్లెల పంచాయతీలలో వర్షం తక్కువగా వచ్చినా గాలి విపరీతంగా వీయడంతో మామిడి తోటల్లోని మామిడి కాయలు నేలరాలి పోయాయని విలపించారు. ఈ కాయలను వ్యాపారులు ఎవరూ కొనుగోలు చేయడం లేదని వాపోయారు. ఈ ఏడాది మామిడి తోటలలో పూత బాగా వచ్చిందని పంట దిగుబడి బాగా ఉంటుందని రైతులు ఆశ పడ్డారు. అయితే ఎండలకు పూత పూర్తిగా రాలిపోయిందని, కనీ సం 10 శాతం కూడా పంట దిగుబడి రాలేదన్నారు. పంట సాగుకు పెట్టిన మందుల పిచికారీ ఖర్చులు వచ్చే అవకాశం కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మామిడి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

హోమియోపతి కళాశాల మంజూరు

కాణిపాకం : జిల్లాకు కొత్త ప్రైవేట్ హోమియోపతి కళాశాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. పూతలపట్టు మండలం ముత్తిరేవుల గ్రామంలో శ్రీనివాస ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా హోమియోపతి కళాశాల ఏర్పాటుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆమోదం తెలిపారు. దీంతో వెంకటేశ్వర హోమియోపతి మెడికల్ కాలేజ్ , హాస్పిటల్ పేరుతో కొత్త ప్రైవేట్ కళాశాలలో ప్రతి సంవత్సరం 100 మంది విద్యార్థులను అవకాశం కల్పించనున్నారు.

వైఎస్సార్‌సీపీ వాళ్లా.. మర్యాదగా వెళ్లిపోండి

- టీడీపీతో కలిసి వస్తే న్యాయం చేస్తామన్న తహసీల్దార్
- దళిత గ్రామం సాకుతో క్వారీకి పట్టా భూమిలో రోడ్డు వేసిన కూటమి నేతలు
- మాజీ డిప్యూటీ సీఎం వద్ద గోడు వెళ్లబోసుకున్న బాధితులు



మీడియాతో మాట్లాడుతున్న బాధితులు.. చిత్రంలో మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

పెనుమూరు (కార్వేటినగరం) : మీరు వైఎస్సార్‌సీపీ వాళ్లా.. మర్యాదగా బయటకు వెళ్లిపోండి.. కూటమి నాయకులతో కలిసి వస్తారా.. లోపలకి రండి అంటూ ఓ తహసీల్దారు పచ్చనేతలకు బానిసై, ఒక పార్టీ కార్యకర్తగా మాట్లాడుతున్నాడని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి ఆరోపించారు. పెనుమూరు మండలం, చెర్లోపల్లి గ్రామానికి చెందిన హేమాద్రి నాయుడు, దాము కలిసి మంగళవారం మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి వద్ద కూటమి నాయకులు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను వివరించారు. స్పందించిన మాజీ ఉప ముఖ్యమంత్రి జిల్లా ఉన్నతాధికారులకు ఫోన్ చేశారు. అయినా స్పందించకపోవడంతో అసహనాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. సర్వే నం.381/1, 384/సీ/1లో హేమాద్రినాయుడు, దాముకు చెందిన భూమిలో దళితవాడకు దారి పేరుతో టీడీపీ నాయకుల క్వారీ కోసం పట్టా భూమిలో దౌర్జన్యంతో అగ్రకులస్తులు కర్రలు, రాడ్లు పట్టుకొని దళితులను భయభ్రాంతులకు గురిచేసి రోడ్డు వేయడం అన్యాయమన్నారు. బాధితులకు అండగా నిలవాల్సిన అధికారులు కూటమి నేతల ఒత్తిడికి తలొగ్గి ప్రజలను హేళనగా మాట్లాడడం మంచిది కాదని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు.



దళితులపై దాడికి రాడ్లతో వచ్చిన కూటమికి చెందిన ఓ సామాజిక వర్గ నేతలు

ఆర్థిక వనరుల విధ్వంసమే రెడ్ బుక్ లక్ష్యం

గంగాధరనెల్లూరు : వైసీపీ వాళ్ల ఆర్థిక వనరుల విధ్వంసమే కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి తీవ్రంగా మండిపడ్డారు. గంగాధర్ నెల్లూరు మండలం, కుప్పనపల్లి గ్రామంలో రైతు శంకర్‌రెడ్డి పొలంలో కూటమి నాయకులు దౌర్జన్యంగా పచ్చని మామిడి చెట్లను నరికి వేసిన ఘటనలో రైతును పరామర్శించారు. రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగా వైసీపీ వాళ్లపై దౌర్జన్యాలు, ఆర్థిక వనరుల నిర్వీర్యమే లక్ష్యంగా పని చేస్తున్నారని మండిపడ్డారు. సీనియర్ నాయకులు బండి హేమసుందర్‌రెడ్డి, వెంకటరెడ్డి, రాష్ట్ర రైతు నాయకులు చెందురాజు, కమాలర్‌రెడ్డి, హరి రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకమైన ఓటర్ల జాబితా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు డీఆర్‌వో మోహన్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలను పాటిస్తూ ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి ఈఆర్‌వో, ఏఈఆర్‌వో, బీఎల్‌వోలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. ఈ ప్రక్రియలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటున్నట్లు చెప్పారు. ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు. మృతి చెందిన ఓటర్లను తొలగించేందుకు కుటుంబ సభ్యులకు నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. ఒక ఓటరుకు రెండు నియోజకవర్గాల్లో ఓటు ఉన్నట్లతై గుర్తించి బీఎల్‌వోల ఆధ్వర్యంలో తొలగింపునకు చర్యలు చేపడుతామన్నారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటరు జాబితా సవరణలో ఇప్పటి వరకు 6,665 ఓటర్లను తొలగించినట్లు చెప్పారు. ఇందులో 642 మృతి చెందిన వ్యక్తులు, 5,588 మంది వలస వెళ్లారని, 435 మంది పునరావృతం అయినట్లు గుర్తించి తొలగించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, సురేంద్ర, అట్లూరి శ్రీనివాసులు, బాలసుబ్రహ్మణ్యం, గంగరాజు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ వాసుదేవన్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే అగ్నిప్రమాదాల నివారణ





ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది.. అవగాహన పత్రాలు అందజేస్తూ..

చిత్తూరు కలెక్టరేట్ : అగ్నిమాపక ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం జిల్లా కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఎండలు పెరిగాయని, అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయన్నారు. ప్రమాదాల నివారణకు అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఏటా ఏప్రిల్ 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అగ్నిప్రమాదం జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా అగ్నిమాపక కేంద్రానికి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ అగ్నిమాపక శాఖ అధికారి కరుణాకర్, లీడింగ్ ఫైర్‌మెన్ ఏసుపాదం, సురేష్ పాల్గొన్నారు.

వేసవి శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో వేసవి కోచింగ్ శిబిరాల నిర్వహణకు ఆసక్తి ఉన్న పీడీ, పీఈటీ, క్రీడా అసోసియేషన్ సభ్యులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాప్ ఆదేశాల మేరకు జిల్లాలో వేసవి శిబిరాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. 2025–26 సంవత్సరానికి జిల్లాలో ఉన్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మే1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 8 ఏళ్ల వయస్సు నుంచి 14 ఏళ్ల వయస్సు గల పిల్లలను క్రమం తప్పకుండా శిక్షణకు ఆకర్షించడం, చిన్న వయస్సులోనే ప్రతిభావంతులైన పిల్లలను క్రీడాకారులుగా గుర్తించడం ముఖ్య ఉద్దేశమన్నారు. ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు క్రీడాశిబిరాల్లో శిక్షణ ఇస్తారన్నారు. క్రీడాశిబిరాల నిర్వహణకు ఆసక్తి ఉన్న వారు ఈనెల 17వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను జిల్లా క్రీడాభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పేదింటి ఆణిముత్యాలకు పురస్కారాలు



విద్యాశాఖమంత్రి నారా లోకేష్ నుంచి అవార్డు అందుకుంటున్న హర్షిత

పలమనేరు : వారిది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబ.. తండ్రి ట్రాక్టర్ డ్రైవర్.. తల్లి దినసరి కూలీగా కుటుంబాన్ని నెట్టుకొస్తూ తమ ముగ్గురి పిల్లలను పలమనేరులోని సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్‌లో పెట్టి చదివించారు. తల్లిదండ్రుల కష్టాలను చూసిన వారు కష్టపడి చదువుతూ తల్లిదండ్రులకు మంచిపేరు తెచ్చిపెడుతున్నారు. వీరిలో పెద్దకుమార్తె తోటి హర్షిత స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్ అండ్ డెయిరీ టెక్నాలజీ కోర్సులో 1000/971 మార్కులను సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచింది. ప్రభుత్వం ఇంటర్ ఫలితాల్లో వివిధ గ్రూపుల్లో టాపర్‌లుగా నిలిచిన 54 మందిని రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా షైనింగ్‌స్టార్ అవార్డుకు హర్షిత ఎంపికైంది. ఆ మేరకు మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నుంచి అవార్డు అందుకుంది. హర్షిత పదో తరగతి దాకా వలసపల్లి నవోదయ పాఠశాలలో చదివింది. హర్షితతో పాటు చెల్లి శ్రావణి సైతం ఇదే కోర్సు చదివింది. మొన్నటి ఫలితాల్లో శ్రావణి 900 పైగా మార్కులను సాధించింది. వీరి తమ్ముడు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు.

కేజీబీవీ విద్యార్థినికి మంత్రి అభినందన



తల్లిదండ్రులతో విద్యార్థిని శ్రావంతి

రొంపిచెర్ల : కేజీబీవీ విద్యార్థిని శ్రావంతిని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో రొంపిచెర్ల కేజీబీవీ విద్యార్థిని శ్రావంతి సీఈసీలో 935 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలోని కేజీబీవీల్లో మొదటి స్థానంలో నిలిచారు. కర్నూల్ జిల్లాకు చెందిన శివన్న, దేవమ్మకు ఇద్దరు కుమార్తెలు..వీరిలో పెద్ద కుమార్తె శ్రావంతి రొంపిచెర్ల కేజీబీవీలో ఇంటర్ పూర్తి చేసింది. రెండో కుమార్తె దీక్షా 9వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులు తిరుపతిలో మేస్త్రి పని చేసుకుని పిల్లలను చదివిస్తున్నారు. కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలలో 26 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాలు సాధించారు. మంగళవారం అమరావతిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థిని శ్రావంతికి ల్యాప్ టాప్‌ను ప్రదానం చేశారు. అలాగే వందశాతం ఫలితాలు సాధించిన కస్తూర్బా విద్యాలయం ప్రిన్సిపల్ సుజాత, అధ్యాపకులను మంత్రి అభినందించారు.